## క్లుప్తంగా

### క్యాలెండర్లు ఆవిష్కరణ


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంస్థ బాధ్యులు

ఖమ్మం మామిళ్లగూడెం: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇండియన్ ఒలంపియాడ్ పరీక్షా క్యాలెండర్లను సోమవారం ఖమ్మంలోని కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ అంతోటి రామకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు పాఠశాలల్లో టాలెంట్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లతో పాటు బహుమతులు అందజేసి సత్కరిస్తున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ స్టేట్ బాధ్యులు జి.కావ్య, జిల్లా ఇన్‌చార్జ్ అన్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 8న వైఎస్సార్ విగ్రహావిష్కరణ

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరి సమీపంలోని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహాన్ని ఈనెల 8న ఆవిష్కరిస్తున్నట్లు పార్టీ నాయకుడు నంద్యాల రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 8న వైఎస్సార్ జయంతి సందర్భంగా షర్మిల విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ఈమేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు హాజరుకావాలని కోరారు.

### కాంగ్రెస్ నేత మృతికి సంతాపం


పరంకుశరావు (ఫైల్)

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుండపనేని పరంకుశరావు (92) సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, ఐదుగురు కుమార్తెలు, ఇరువురు కుమారులు ఉన్నారు. ఈమేరకు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెంట జెడ్పీ వైస్ చైర్మన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీటీసీ మరికంటి ఉమారాణి తదితరులు ఉన్నారు. అలాగే, నాయకులు స్వర్ణ, హన్మంతరావు, నాగేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

### దుండగులపై చర్యలు తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం జైనగర్‌కాలనీలో గల ఖాళీ స్థలంలో గత పదహారేళ్లుగా ధార్మిక పూజలు నిర్వహిస్తున్న దేవతా విగ్రహాలను కొంతమంది దుండగులు ధ్వంసం చేసి ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ సోమవారం ఆ ప్రదేశాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహాలను దొంగిలించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అర్బన్ పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యాంసుందర్ నాయక్, ఉపాధ్యక్షులు గుత్తా వెంకటేశ్వర్లు, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, కుమిలి శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు, రేపు పీవైఎల్ రాష్ట్ర మహాసభలు

తిరుమలాయపాలెం: మంగళ, బుధవారాల్లో ఇల్లెందులో జరిగే పీవైఎల్ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా కార్యదర్శి గొర్రెపాటి రమేష్ అన్నారు. సోమవారం మండలంలోని దమ్మాయిగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్‌కె.షబ్బీర్, శ్రీను, గోకినేపల్లి రమేష్, నవీన్, అరుణ, యాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: ప్రైవేట్ పాఠశాలలో అధిక ఫీజులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సుధాకర్ డిమాండ్ చేశారు. సోమవారం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యాశాఖాధికారికి అందించారు. గుర్తింపులేని పాఠశాలలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బస్సుల ఫిట్‌నెస్, లైసెన్స్ డ్రైవర్లపై విచారణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సితార్ రాజు, యాకూబ్, పవన్, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### నగరంలో సినిమాలు

| | |
|---|---|
| తిరుమల | ఆదిపురుష్ |
| వినోద | స్పై |
| సాయిరాం | సామజవరగమన |
| ఆదిత్య | లవ్ యూ రామ్, ఈనగరానికి ఏమయ్యింది |
| శ్రీనివాస | ఇండియానా జోనెస్ |
| సుందర్ | నారాయణ అండ్ కో |

– ఖమ్మం గాంధీచౌక్

# ‘భౌ’బోయ్.. కరుస్తున్నాయ్!

**కోయచలకలో కుక్కల స్వైర్వవిహారం**

- ఒక్కరోజే నలుగురిపై దాడి
- ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు
- ఒంటరిగా రావాలంటే భయపడుతున్న జనం
- కుక్కల బెడద తొలగించాలని గ్రామస్తుల వేడుకోలు


కుక్కదాడిలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లీకుమారుడు

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక గ్రామంలో కుక్కల దాడులతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఒంటరిగా బయటకు రావాలంటేనే వణికిపోతున్నారు. ఎప్పుడు ఎటు వైపు నుంచి కుక్కల గుంపు వచ్చి దాడి చేస్తాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈక్రమంలోనే సోమవారం తెల్లవారుజామున ఒక్క రోజే గ్రామంలోని నలుగురిపై కుక్కదాడి చేసి గాయపరచాయి. ప్రస్తుతం వారంతా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కరిసిన కుక్క పిచ్చి కుక్క ఏమోనని మరింత భయపడుతున్నారు.

**మూగజీవాలపై దాడి..**

గత కొన్ని రోజులుగా గ్రామంలో కుక్కల గుంపు స్వైర్వ విహారం చేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. పాఠశాలకు వెళ్లాలన్నా, వ్యవసాయ పనుల కోసం వెళ్లాలన్నా మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు. మనుషులపైనే కాకుండా మూగజీవాలైన పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లను సైతం వదిలిపెట్టడం లేదు.

**వ్యర్థాలు తింటూ స్వైర విహారం..**

గతంలో అడపాదడపా గాయపరిస్తుంటే వారు ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి చికిత్స పొందిన ఘటనలు అనేక ఉన్నట్లు తెలిపారు. పశువులను సైతం గాయపరచడంతో అవి వింత ప్రవర్తన చేస్తున్నాయని చెపుతున్నారు. కుక్కలు గ్రామ సమీపంలోని వ్యర్థాలను తింటూ.. గుంపులుగా స్వైరవిహారం చేయడం గత కొన్ని రోజులుగా సర్వసాధారణంగా మారిందని పేర్కొంటున్నారు. మనుషులపై దాడి చేశాయని తెలిసిన కొందరు యువకులు దాన్ని నిర్మూలించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఇప్పటికైనా అధికారులు గ్రామంలో కుక్కల బెడదను తొలగించాలని, గాయాలైన పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, మనుషులకు వైద్య పరీక్షలు చేసి తగిన వైద్యం, కుక్కకాటు టీకాలు అందించాలని కోరుతున్నారు.

**కోళ్లను వదిలి మహిళపై..**

గ్రామానికి చెందిన వెంకటేశ్వరమ్మ అనే మహిళ సోమవారం తెల్లవారు జామున తన ఇంట్లో కోళ్లపై కుక్క దాడి చేస్తుందని గుర్తించి గద్దించే ప్రయత్నం చేసింది. అంతే ఆ కుక్క కోళ్లను వదిలి ఆమెపై దాడికి దిగాయి. దీంతో ఆమె కేకలు వేయడంతో ఇంట్లో ఉన్న కుమారుడు సాయిచైతన్య కుక్కల నుంచి తల్లిని రక్షించే ప్రయత్నం చేయగా.. అతడిపై కూడా దాడి చేశాయి. ఈక్రమంలో వారిరువులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు కర్రలతో కుక్కను గద్దించడంతో అక్కడ నుంచి పారిపోయినట్లు తెలిపారు. తర్వాత అదే గ్రామంలో విజయశేఖర్, జానికి రామయ్యలపై కూడా దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. ఇలా గ్రామంలో ఒక్క రోజే నలుగురిని గాయపరచడంతో గ్రామస్తులంతా భయపడుతున్నారు.


కుక్కదాడిలో తీవ్ర గాయాలు ఇలా..

**చర్యలు తీసుకోవాలి..**



గ్రామంలో గత కొంతకాలంగా కుక్కల బెడద తీవ్రంగా ఉంది. దారిన పోవాలంటే మహిళలు, చిన్నారులు భయపడుతున్నారు. ఒక్కరోజు నలుగురిని కరవడం, మూగజీవాలపై దాడికి పాల్పడడంతో మరింత భయంగా ఉంది. పిచ్చికుక్కలు కూడా తిరుగుతున్నాయి.

– తోట వెంకట్, కోయచలక

**పశువులను సైతం వదలడం లేదు..**



గ్రామంలో కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. గద్దించితే ఎదురుదాడికి పాల్పడుతున్నాయి. మనుషులపైనే కాకుండా గ్రామంలోని మూగజీవలను వదలడం లేదు. కుక్క కనపడితే భయపడాల్సి వస్తోంది. గ్రామంలో కుక్కలు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– మేళ్లచెర్వు శివయ్య, కోయచలక

**అడివిలో వదిలే ప్రయత్నం చేస్తాం..**



గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగానే ఉంది. గ్రామస్తుల ఒత్తిడి మేరకు కుక్కలను పట్టుకునే వారిని పిలిపించి గ్రామంలో సంచరించే వీధి కుక్కలన్నింటినీ పట్టుకొని అడవిలో వదిలిపెట్టే ప్రయత్నం చేస్తాం. ఒక్కరోజే మనుషులతో పాటు పశువులను గాయపరచడం బాధాకరం.

– మాధంశెట్టి హరిప్రసాద్, సర్పంచ్

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ


కూసుమంచి: చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కందాల

నేలకొండపల్లి/ ఖమ్మంరూరల్/కూసుమంచి: మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మందికి రూ.8,92,500 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. అదే విధంగా పలు గ్రామాల్లో దేవాలయాలు, చర్చిలు, కుల ఆరాధ్య దేవాలయాల నిర్మాణాలకు రూ.14.50 లక్షలను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, రైతు సమన్వ సమితి అధ్యక్షుడు సతీష్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్‌లు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే రూరల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన 44 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే కందాల రూ.14,96,500 విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ ఎ. వరప్రసాద్, సుడా డైరెక్టర్ గూడా సంజీవరెడ్డి, ఎ. వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 52 మంది లబ్ధిదారులకు రూ.20.26లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కందాల పంపిణీ చేశారు. అనంతరం పలు గ్రామాల్లోని ఆలయాలు, మసీదు, చర్చిలకు రూ.13లక్షల ఆర్థిక సాయం అందజేశారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సిఫారసు మేరకు రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన అనారోగ్య సమస్యతో బాధపడుతున్న బుద్ది సావిత్రమ్మ, శారదలకు మంజూరైన రూ.1.02 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంపటి సురేందర్, కోట శ్రీనివాసరెడ్డి, గోపి, ప్రభాకర్‌రెడ్డి, రజబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే సమక్షాన బీఆర్ఎస్‌లో చేరిక..**

కూసుమంచి: మండలంలోని ముత్యాలగూడెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. సోమవారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వేముల వీరయ్య, డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఆత్మా కమిటీ చైర్మన్ రామసహాయం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ బొల్లికొండ శ్రీనివాసరావు, ఎంపీటీసీ ఉడుగు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం దిగొచ్చే వరకూ సమ్మె


తిరుమలాయపాలెం: వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు


నేలకొండపల్లి: ఎంపీఓకు సమ్మె నోటీసు అందిస్తున్న నాయకులు

నేలకొండపల్లి/రఘునాథపాలెం/తిరుమలాయపాలెం/ఖమ్మంరూరల్: ఈ నెల 6 నుంచి పంచాయతీ వర్కర్లు చేపట్టనున్న సమ్మె ప్రభుత్వం దిగొచ్చే వరకూ కొనసాగిస్తామని సీటు జిల్లా ప్రధాన కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు సూచించారు. నేలకొండపల్లి మండలకేంద్రంలో సోమవారం మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) శివకు సమ్మె నోటీసు అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్మికుల సమ్మెకు ప్రజాప్రతినిధులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు మద్దతు ఇవ్వాలని కోరారు. సీటు జిల్లా నాయకులు పగిడికత్తుల నాగేశ్వరరావు, పంచాయతీ వర్కర్ల నాయకులు బొడ్డు అంజనేయులు, రహీంతుల్లా, కందుల బాబు, అనిత తదితరులు పాల్గొన్నారు. అలాగే రఘునాథపాలెం గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం ఆధ్వర్యాన 6న చేపట్టే సమ్మె నోటీసులను డీఎల్‌పీఓ పుల్లారావు, ఎంపీడీఓ రామకృష్ణలకు అందించినట్లు మండల పంచాయతీ కార్మిక సంఘం జేఏసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిట్టల మల్లయ్య, శ్రీను, మురళీకృష్ణ, వీరయ్య, రాందాస్, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలాయపాలెంలో సీఐటీయూ ఆధ్వర్యాన ఎంపీడీఓ జయరాంకు సమ్మె నోటీసు అందించారు. సీఐటీయూ మండల కన్వీనర్ వి.వీరన్న, జేఏసీ నాయకులు ఎండీ. పాషా, ఎం.సైదులు, ఎస్. ఎల్లయ్య, ఎం, శ్రీను, కె. రవి, బాబు, ఎన్. పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు. అంతేకాక రూరల్ మండలంలో సీఐటీయూ ఆధ్వర్యాన ఎంపీడీఓ అశోక్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పిన్నింటి రమ్య, నాయకులు కె.నాగరాజు, జె.రాములు, లక్ష్మీనారాయణ, వంగర ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

### తాడ్వాయి కుట్ర కేసు ఎత్తివేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కూసుమంచి: పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్యతో పాటు 152 మందిపై కేసీఆర్ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన తాడ్వాయి కుట్ర కేసును ఎత్తివేయాలని జిల్లా నాయకురాలు కల్పన డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని జుజుల్‌రావుపేటలో కుట్రకేసులు ఎత్తివేయాలని కోరుతూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. సీఎం కేసీఆర్ ప్రోద్బలంతో తాడ్వాయి పోలీసులు కుట్రపన్ని మావోయిస్టు పార్టీకి అనుబంధంగా ఉండే ప్రజా సంఘాల్లో పనిచేస్తున్నారంటూ అక్రమ కేసులు పెట్టారని అన్నారు.వెంటనే పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మణెమ్మ, శ్రీలత, చుక్కమ్మ, ఉమాభారతి, ప్రవళిక, శిరీష తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఆర్థిక సాయం


చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మంలోని అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ట్రిపుల్ ఐటీలో స్థానం సంపాదించిన పలువురి విద్యార్థులకు పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఒక్కొక్కరికి రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. నిరుపేద కుటుంబానికి చెందిన రఘునాథపాలెం గ్రామానికి చెందిన బుట్టి కీర్తిప్రియ గురుకుల కళాశాలలో చదివి ఐఐటి కాన్పూర్‌లో సీటు సంపాదించింది. ఇదే కళాశాలలో చదివిన తెల్దారుపల్లి గ్రామానికి చెందిన పాము యశస్విని ఐఐటీ పాల్కాడ్‌లో సీటు సంపాదించింది. ఈ సందర్భంగా పరిశ సీతారత్నం చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు పరిశ పుల్లయ్య మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధి కోసం ట్రస్టు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీఓ కె.ప్రత్యూష, కళాశాల ప్రిన్సిపాల్ చావా జ్యోతి, అధ్యాపక బృందం దామాల రాంకోటి, పాషా, బోసు, వి.వెంకటేశ్వరరావు, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు పునరావృతం కావొద్దు..


గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: నగర పాలకసంస్థలో సమస్యలపై ఫిర్యాదులు అందితే పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్‌లో భాగంగా కేఎంసీ కార్యాలయంలో పలు సమస్యలపై కమిషనర్‌కు 38 ఫిర్యాదులు అందాయి. దీంతో వాటిని పరిశీలించి ఆయా విభాగాల అధికారులకు వాటిని అందజేసి మాట్లాడారు. ఫిర్యాదులు మరల పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఓ జి.శ్రీనివాస్, ఈఈ కృష్ణాలాల్, ఆర్ఐలు కె.శ్రీనివాస్, లోకేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ‘పోడు’కు హక్కుపత్రాలు ఇవ్వాలని ధర్నా


ధర్నా చేస్తున్న పోడు సాగుదారులు, సీపీఎం నాయకులు

రఘునాథపాలెం: మండలంలో అనేక దశాబ్దాలుగా పోడు భూమినే నమ్ముకుని సాగు చేసుకుంటున్న గిరిజనేతరులకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని గణేశ్వరం గ్రామంలో సీపెం మండల కమిటీ ఆధ్వర్యంలో పోడు సాగుదారులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించాక గ్రామ బొడ్రాయి సెంటర్ వద్ద ధర్నా చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ..మండల పరిధిలో సుమారు 1,200 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 197 మందికి మాత్రమే హక్కుపత్రాలు ఇచ్చారన్నారు. తిరస్కరణకు గురైన దరఖాస్తులను రీ సర్వే చేయించాలని, మరణించిన వారి పేరుమీద ఉన్న హక్కు పత్రాలను వారి కుటుంబసభ్యుల పేర్లతో బదలాయింపు చేసుకునేలా మరో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కన్నెగంటి తిరుపయ్య, కన్నెగంటి వెంకన్న, వల్లూరి శ్రీనివాస్, వల్లూరి వెంకటనారాయణ, రాములమ్మ, నరసమ్మ, దుంప వెంకన్న, జోగు రామకృష్ణ, సిద్ధంశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### మ్యాథ్ ఒలింపియాడ్‌లో ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి

ఖమ్మం సహకారనగర్: సీఆర్.రావు అడ్వాన్స్‌డ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్(ఏఐఎంఎస్‌సీ) ఆధ్వర్యాన నిర్వహించిన గణిత ఒలింపియాడ్‌లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ పి.రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి తెలిపారు. ఒలింపియాడ్ జనవరిలో నిర్వహించగా తమ విద్యార్థులు 2నుంచి 20వ ర్యాంక్ వరకు సాధించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం వారిని కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ అభినందించారు.

### ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల సత్తా..

రఘునాథపాలెం/ కూసుమంచి: సోమవారం విడుదలైన ట్రిపుల్ ఐటీ ఫలితాల్లో రఘునాథపాలెం మండలంలోని కోయచలక పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని వనిగళ్ల తేజస్విని బాసరలో సీటు సాధించినట్లు పాఠశాల హెచ్ఎం అనితారెడ్డి తెలిపారు. ఈమేరకు విద్యార్థిని గ్రామ సర్పంచ్ హరిప్రసాద్‌తో పాటు పాఠశాల యాజమాన్యం అభినందించారు. అలాగే కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మునుగోటి కీర్తన బాసర ట్రిపుల్ ఐటీలో అర్హత సాధించినట్లు హెచ్ఎం రేలా విక్రంరెడ్డి తెలిపారు. ఈమేరకు కీర్తనను హెచ్ఎంతో పాటు సర్పంచ్ చెన్నా మోహన్, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, ఎస్ఎంసీ చైర్మన్ మైమూనా, ఉపాధ్యాయులు అభినందించారు.

### ఇంట్లోకి వెళ్లొచ్చే సరికి వాహనం చోరీ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం 12వ డివిజన్ వివేకానంద నగర్‌లో ఇంటిముందు నిలిపిన ద్విచక్రవాహనం చోరీ అయింది. కాలనీకి చెందిన నున్నా వెంకటేశ్వరరావు తన వాహనాన్ని ఆదివారం రాత్రి పార్క్ చేసి కాసేపయ్యాక బయటకు వచ్చేసరికి కనిపించలేదు. దీంతో ఎక్కడ వెతికినా ఆచూకీ లేకపోవడంతో సోమవారం ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### కార్మికుడి శరీరంలోకి దిగిన చువ్వలు

నేలకొండపల్లి: జాతీయ రహదారి నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు కల్వర్ట్‌పై పడటంతో శరీరంలోకి చువ్వలు దిగాయి. కోదాడ–కురవి జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన బబ్లూ మండల కేంద్రంలోని సమీపాన పనిచేస్తున్నాడు. ఈమేరకు సోమవారం ఆయన ప్రమాదవశాత్తు కాలు జారి కల్వర్ట్‌పై పడగా.. అక్కడ ఉన్న చువ్వలు శరీరంలోకి దిగాయి. దీంతో సహచర కూలీలు నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స చేయించి ఖమ్మం తీసుకెళ్లారు.

### వర్షం కురవాలని పూజలు..

కూసుమంచి: మండలంలోని బికారితండాలో వానలు కురవాలని, పంటలు బాగా పండాలని సోమవారం పలువురు గిరిజన యువకులు కప్పలను గ్రామంలో ఊరేగించారు. డప్పు వాయిద్యాలతో ఇంటింటికి తిరుగుతూ బియ్యం, నగదు వసూలు చేశారు. అనంతరం ఊరు చివరన వరుణదేవుడికి పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. హనుమంత్ నాయక్ ఆధ్వర్యాన జరిగిన ఈ వేడుకలో సిద్ధూ, శేఖర్, సింహాద్రి, సురేష్, ప్రవీణ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

### ‘మతం పేరుతో చిచ్చు పెడుతున్న బీజేపీ’

ఖమ్మంమయూరిసెంటర్: దేశంలో బీజేపీ ప్రభుత్వం మరోసారి వస్తే మతల మధ్య చిచ్చుపెట్టి మతోన్మాదాన్ని పెంచుతుందని రాజకీయ విశ్లేషకుడు పిట్టల రవి అన్నారు. సోమవారం ఖమ్మంలోని సుందరయ్య భవనంలో సీపీఎం ఖమ్మం టూ టౌన్ కమిటీ, ఖమ్మం అర్బన్ కమిటీల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. టూటౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్ అధ్యక్షతన జరిగిన ఈ తరగతుల్లో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై విక్రమ్, నాయకులు ఎస్‌కె.మీరాసాహెబ్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

### పరామర్శ..

నేలకొండపల్లి: ఇటీవల అస్వస్థతకు గురైన మండలంలోని పైనంపల్లికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు పొట్టపింజర బాలస్వామిని వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ పరామర్శించా రు. ఖమ్మంలో చికిత్స పొందుతున్న ఆయనను సోమవారం పరామర్శించి చికిత్స వివరాలు తెలుసుకున్నారు. నాయకులు వంగూరి ఆనందరావు, పగిడికత్తుల ఈదయ్య పాల్గొన్నారు.

# బాబా ఆలయాలు కిటకిట


ఖమ్మంఅర్బన్: బల్లేపల్లిలోని మాతృశ్రీలలితా పరమేశ్వరి ఆశ్రమంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు


ఖమ్మంరూరల్: పోలేపల్లిలో ద్వారకామయి షిర్డీ సాయి సేవాశ్రమంలో..

గురుపౌర్ణమి సందర్భంగా శ్రీషిర్డీ సాయిబాబా మందిరాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. సోమవారం వేకువజాము నుంచే ఆలయాలకు భక్తుల తాకిడి మొదలైంది. అర్చకుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, గోత్రనామార్చన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యాన అన్నదానం చేశారు. పలువురు ప్రముఖులు సైతం సాయిబాబాను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. –సాక్షినెట్‌వర్క్

**మాజీ ఎంపీ పూజలు..**


సాయినాథుడిని దర్శించుకుంటున్న పొంగులేటి

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి సందర్భంగా నగరంలోని గాంధీచౌక్‌లో ఉన్న శ్రీ వరప్రదాత షిర్డీ సాయి మందిరాన్ని సోమవారం ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి దర్శించుకున్నారు. అనంతరం పొంగులేటితో పాటు శ్రీ సిటీ డెవలపర్స్ అధినేత గరికపాటి వెంకటేశ్వరరావులను మందిర చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శి అర్వపల్లి నిరంజన్, కోశాధికారి కురువెళ్ల జగన్మోహన్‌రావు తదితరులు శాలువాలతో సత్కరించి, బాబా చిత్రపటాలను బహూకరించారు.